క్లుప్తంగా

పారిశుధ్యాన్ని చక్కదిద్దండి



కోటవురట్ల శివారు గొల్లపేటలో పారిశుధ్యం పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల: వర్షాలు విస్తారంగా కురుస్తున్న కారణంగా పారిశుధ్యం పట్ల ప్రత్యే శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సోమవారం సమావేశం నిర్వహించి పారిశుధ్యంపై సమీక్ష చేశారు. మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయని, అన్ని గ్రామ పంచాయతీల్లో ఎక్కడా నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుకు సూచించారు. అనంతరం గొల్లపేట ప్రాంతంలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు.

హెచ్ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన

పాయకరావుపేట : పీఎల్‌పురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో సోమవారం స్టాల్ యాక్టివిటీ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది. హెచ్ఐవీ, సుఖవ్యాధుల గురించి ఐఈసీ మెటీరియల్ ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందు, జోనల్ సూపర్వైజర్ డి.రమణ, లింక్ వర్కర్ జి.హెచ్.నర్సింగరావు, ఎం.ఎల్.హెచ్.పి. సిహెచ్.కల్యాణి, ఏఎన్ఎం వి.ఎం.ఎస్ లక్ష్మి, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా గంగాలమ్మతల్లి గుడి నిర్మాణం

మునగపాక : మూలపేటలో గంగాలమ్మతల్లి గుడి నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం రంగులు దిద్దే పనులు జరుగుతున్నాయి. ఆగస్టు 19న గంగాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు మరింత మంది ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.

డెంగ్యూ పట్ల నిర్లక్ష్యం వద్దు

ఎస్.రాయవరం : డెంగ్యూ వ్యాధిపట్ల నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. జీవీపాలెం, లింగరాజుపాలెం గ్రామాల్లో సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వర్షాలు విరివిగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు.

పొలాలకు దారి లేకుండా చేస్తున్నారు...

మునగపాక : పంట పొలాలకు వెళ్లేందుకు అనువుగా ఉండేలా ఏర్పాటు చేసిన రహదారి సదుపాయానికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు పెంటకోట అచ్చియ్యనాయుడు, అప్పలనాయుడు, ఆడారి వెంకట్, గోపి తదితరులు మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం తమ పొలాలకు వెళ్లేందుకు సాగునీటి కాలువలో సిమెంట్ పైప్‌లు వేసుకున్నామన్నారు. అయితే కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాలకు పైప్‌లను తొలగించేందుకు యత్నిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని వారు కోరారు.

సాగునీటి కాలువలు కప్పేస్తున్నారు...

మునగపాక: వ్యవసాయ రంగానికి సంబంధించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ సోమవారం రైతులు స్థానిక తహసీల్దార్ పాపారావుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ మాట్లాడుతూ కొంతమంది లే-అవుట్‌లు వేసేటపుడు సాగునీటి కాలువలు కప్పేస్తున్నారని దీంతో సాగునీటికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. దీనికి తోడు రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ పాపారావు సంబంధిత అధికారులను పిలిపించి చర్యలకు ఆదేశించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్, రైతులు జగ్గారావు,దాడి శివ, వెలగా మురళి, అప్పలనాయుడు, ఆడారి లక్ష్మణరావు, రామునాయుడు పాల్గొన్నారు.



బాసలు చేశారు.. బాధ్యత మరవొద్దు

ఎన్నికల ముందు బోలెడు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి దాదాపు 45 రోజులు కావస్తోంది. కక్ష సాధింపులకు స్వస్తి పలికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ పలువురు ప్రజలు అధికార పార్టీ ఎమ్మెల్యేలను కోరుతున్నారు.

- కక్ష సాధింపులు కాదు
- సుపరిపాలన కావాలి
- అసెంబ్లీలో మా గోడు వినిపించాలి
- అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ప్రజల వినతి

నక్కపల్లి : ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో పలు ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తామని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. వీటిలో ప్రధాన మైనవి పెన్షన్లను రూ.4 వేలకు పెంచుతామన్నారు. ఇది అమలు చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, 50 ఏళ్లు నిండిన బీసీలకు వృద్ధాప్య పింఛను, 18 ఏళ్లు దాటిన మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు చొప్పున చెల్లిస్తామని, రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. వీటిలో ఒక్క దాని గురించి కూడా ఇంత వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు.

ఇవిగో మీ హామీలు....

- నక్కపల్లి ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటరు ఏర్పాటు చేస్తామని, డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మిస్తామని, పందూరు, జల్లూరులో శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో కొత్త వంతెనలు నిర్మిస్తామని చెప్పారు.
- అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లె రోడ్డు పూర్తిగా పాడయిందని విమర్శిస్తూ దీనిపై హోం మంత్రి అనిత గతంలో ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్ర చేశారు. అధికారంలోకి వస్తే కొత్త రోడ్డు నిర్మిస్తామమి హామీ ఇచ్చారు.
- మత్స్యకారుల కోసం ప్రత్యేక పాఠశాల, స్కిల్ డెవలప్ మెంట్ సెంటరు ఏర్పాటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో పాటు పాయకరావుపేట మెయిన్ రోడ్డు విస్తరణ చేపడతామన్నారు.
- తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులను ఆదుకుంటామని, తాండవ, వరాహ నదుల ఆధునికీకరణ చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని, ఉద్దండపురం వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేసి ప్రతి గ్రామానికి తాగు నీరు అందిస్తామంటూ హామీలు ఇచ్చారు.
- ఈ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులుకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఏపీఐఐసీ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టర ప్రకారం నష్టపరిహారం, ప్రత్యేక ప్యాకేజీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఉపమాక దేవస్థానాన్ని టీటీడీ వారు ఇచ్చిన హామీలను అమలు చేయిస్తామని ప్రకటించారు. ఇవన్నీ నెరవేర్చాలని నియోజకవర్గం ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్లు అభివృద్ధి చేయండి



టీడీపీ ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. గత ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేయలేదని టీడీపీ నేతలు నానా రభస చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చాలా గ్రామాల రహదారులు దారుణంగా ఉన్నాయి. ఈ సమస్య ను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో లేవనెత్తి వెంటనే రహదారులను అభివృద్ధి చేయాలి.

– రమణ, సన్యాసిరాజుపాలెం, కోటవురట్ల మండలం

స్థానికులకు ఉపాధి కల్పించాలి



పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి. నర్సీపట్నం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. ప్రధానంగా ఏపీఐఐసీ వారి నుంచి నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి. ప్రజలకు హాని కలిగించే పరిశ్రమల ఏర్పాటును అడ్డుకోవాలి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయాలి.

– అప్పలరాజు, సీఐటీయు నాయకుడు

సమస్యలన్నీ తీర్చాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు. నియోజకవర్గంలో పలు ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిగ్రీ కళాశాలకు సిబ్బందిని నియమించి నూతన భవనాలు నిర్మించాలి. ట్రామా కేర్‌సెంటరు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలి. వరహానదిపై మినీ బ్యారేజీ నిర్మించాలి. వాటర్ గ్రిడ్ పూర్తిచేయాలి, మత్స్యకారులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి, స్టోరేజీ షెడ్లు నిర్మించాలి.స్కిల్‌డెవలప్ మెంట్‌ఏర్పాటు చేయాలి,

– మేడేటి శంకర్, నక్కపల్లి

కక్షలు మాని పాలనపై దృష్టి పెట్టాలి



కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మానుకుని రాష్ట్రం, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి. ఏపీకి ప్రత్యేక హోదా గురించి పోరాటం చేయాలి. రైతు భరోసా, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలు వెంటనే అమలు చేయాలి, అలాగే తాండవ, ఏటికొప్పాక చక్కెర పరిశ్రమలను తెరిపించాలి. రైతులను కార్మికులను ఆదుకోవాలి. నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయాలి. మెయిన్‌రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలి.

– జగతా శ్రీను, పాయకరావుపేట

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



నియోజకవర్గంలో నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయాలి, ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటరు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని నియమించాలి. డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించాలి. తాగునీటి సమస్య పరిష్కరించాలి. మహిళల స్వయం ఉపాధి కొరకు ట్రెనింగ్ సెంటరు ఏర్పాటు చేయాలి. వీటన్నింటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. నియోజకవర్గానికి ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి. అలాగే ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలి.

– ఎల్లేటి సత్తిబాబు, నక్కపల్లి

యలమంచిలికి ఏం చేస్తారు?

అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తన గళాన్ని వినిపించి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నారు.

మునగపాక : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకోవాలి. తాము అధికారంలోకి వస్తే మెరుగైన సేవలందిస్తామంటూ ఇచ్చిన హామీలకు భరోసా కల్పించాల్సి ఉంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి కక్ష సాధింపులకు దిగడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ద్వారా ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తూ ప్రజల మన్ననలు పొందాల్సి ఉంది ఈ దిశగా ప్రజా ప్రతినిధులు పాటు పడాలని పలువురు కోరుతున్నారు.

సమగ్ర తాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయాలి

యలమంచిలి : పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణ అలాగే సుందరీకరణపై దృష్టి సారించాలి. రూ.101 కోట్లతో నిర్మిస్తున్న సమగ్ర రక్షిత తాగునీటి పథకం పూర్తి చేయాల్సి ఉంది.మూతపడిన ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి.పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు అలాగే యలమంచిలి రైల్వే స్టేషన్‌లో ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ సదుపాయం కల్పించాలి.

స్థానిక యువతకు ఉపాధి

రాంబిల్లి : మండలంలో నేవల్ బేస్ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి.గోకివాడ ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాలి. పెదకలవలాపల్లి, దిమిలి మధ్య, శారదానదిపై వంతెన నిర్మాణం చేపట్టాలి.ఈ వంతెన పూర్తయితే వ్యవసాయ పంటలతో పాటు రవాణా పరమైన సమస్యలు తొలగిపోతాయి.అలాగే ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశం కల్పించాలి.

చిరకాల వాంఛ...జూనియర్ కళాశాల

మునగపాక : మండల చిరకాల వాంఛగా మిగిలిన జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. 60 సంవత్సరాల క్రితం నిర్మించిన హైస్కూల్ నేటికీ అప్‌గ్రేడ్ కాలేదు. నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలి. లోతట్టు ప్రాంతాల్లో ప్రధాన సమస్యను పరిష్కరించాలి, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అలాగే సాగునీటి వనరులు అధ్వానంగా ఉన్నాయి. రైతాంగానికి అవసరమయ్యే నీటి వనరుల పరిస్థితి దారుణంగా ఉంది.కాలువల్లో తుప్పలు పేరుకుపోవడం అలాగే పలు చోట్ల కాలువల స్వరూపం కోల్పోవడం కనిపిస్తున్నాయి. అలాగే ఉమ్మలాడ వద్ద శారదానదిపై గొడారి ఆనకట్ట నిర్మించి రైతులకు మేలు జరిగేలా చూడాలి.

రైతు సమస్యలపై ఎమ్మెల్యే గళమెత్తాలి



మునగపాక వ్యవసాయంతో కూడిన ప్రాంతం, వ్యవసాయ ఉత్పత్తులకు అవసరమయ్యే గిట్టుబాటు ధరలు కల్పించేలా దృష్టి సారించాలి.శారదానదిపై రిజర్వాయర్లు కట్టాలి. ప్రణాళిక రూపొందించి రైతులకు అనువుగా ఉండేలా చూడాలి.కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పించాలి, పంట నష్టం జరిగితే కౌలు రైతుకు న్యాయం జరిగేలా చూడాలి.అసెంబ్లీలో రైతుల సమస్యలపై మాట్లాడాలి. ఎస్ఈజెడ్‌లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలి.ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి.

– ఎస్.బ్రహ్మాజీ, సీఐటీయూ నేత

ముంపులో వరి నారుమళ్లు...ఆదుకోండి



మునగపాకలో ముంపునకు గురైన నారుమళ్లను పరిశీలిస్తున్న అధికారులు



ముంపునకు గురైన నారుమడిని పరిశీలిస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మజీ

మునగపాక : అల్పపీడన ప్రభావంతో ముంపునకు గురైన వరినారును పరిశీలించి రైతులను ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మజీ కోరారు. మునగపాకలో ముంపునకు గురైన వరి నారుమళ్లను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడంతో పాటు ఉచితంగా విత్తనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వెంకటసూరి, నాగసూరి ఆయన వెంట ఉన్నారు.

నారుమళ్లు పరిశీలించిన అధికారులు

మండల కేంద్రంలో ముంపునకు గురైన వరి నారుమళ్లను అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తితో పాటు పలువురు వ్యవసాయాధికారులు పరిశీలించారు. మడుల నుంచి తక్షణమే నీరు బయటకు పోయేలా చూడాలన్నారు. లీటరు నీటిలో 1 మిల్లీలీటర్ ప్రొపికొనజాల్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ ముంపులో ఉన్న నారుమళ్లకు పొడ తెగులు సోకే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, ఏవో విజేత, ఏఈవో లక్ష్మి, వీఏఏలు సింధూజ, రవిరాజ్, తులసి, రైతులు లక్ష్మణరావు,శివ అప్పారావు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీటి ముంపునకు గురైన వరి నారుమడుల్లో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల బృందం సూచించింది. సోమవారం యలమంచిలి మండలంలోని జంపపాలెం, తురంగలపాలెం, సోమలింగపాలెం, గొల్లగుంట, యలమంచిలి గ్రామాల్లో బృందం పర్యటించింది. నీటి ముంపునకు గురైన వరి నారుమడులను వారు పరిశీలించారు. నారుమళ్లలో చేరిన నీటిని వీలైనంత త్వరగా తొలగించిన తర్వాత 5 సెంట్ల నారుమడికి కేజీ యూరియా, కేజీ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మిశ్రమాన్ని చల్లాలని సూచించారు. తెగుళ్ల నివారణకు రెండు గ్రాముల కార్బండిజం లేదా మాంకోజెట్ మిశ్రమాన్ని లీటరు నీటిలో కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలన్నారు. వరి నారు మొలక దశలో దెబ్బతింటే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించి కొత్త వరి విత్తనాలు సేకరించి సాగు ప్రారంభించడం మంచిదని సూచించారు. నారు మడుల చుట్టూ గట్లపై ఉన్న కలుపు మొక్కలను తొలగించుకోవాలన్నారు. వరినారు పీకే వారం రోజుల ముందు 5 సెంట్ల వరి నారుమడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ చల్లుకోవాలన్నారు. నీరు నిలిచిన చెరకు పొలంలో నీటిని తొలగించి ఎకరానికి 25 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పొలంలో చల్లుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం సేద్య విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం బీజీఎస్ కుమారి,పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఏబీయం,యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ ఉపసంచాలకులు ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో తుపాను రక్షిత చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి

నక్కపల్లి : తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్‌రావు సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందితో సమీక్ష జరిపారు. ఎడతెరపి లేని వర్షాల కారణంగా ఇళ్లు, పాఠశాలలు, పంటలు, రోడ్లకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని, ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచనలు చేశారు. మురుగు కాలువల్లో చెత్త, మురుగు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పూడిమడకలో అధికారుల పర్యటన

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడకలో సోమవారం అధికారులు పర్యటించారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాల కారణంగా సముద్ర తీరాన్ని పరిశీలించారు. ప్రజలకు తగు జాగ్రత్తలు వివరించారు. తుపాను నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఉండాలన్నారు. అలాగే ఆహారం విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సురేష్‌కుమార్,తహసీల్దార్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.



కె.వెంకటాపురం-కొడవటిపూడి రహదారిలో వర్షపునీరు



పూడిమడక వద సముద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీధర్

వదలని వాన

కోటవురట్ల : వర్షం వదల్లేదు. ఎడతెరిపిలేకుండా చినుకులు పడుతుండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. కె.వెంకటాపురం–కొడవటిపూడి రహదారిలో వర్షపునీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



పెదఈశ్వరరావుని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : మండలంలో వైఎస్సార్‌సీపీ నేత పోలిశెట్టి పెద ఈశ్వరరావు సతీమణి పోలిశెట్టి లక్ష్మి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ సంతాపం తెలిపారు. దార్లపూడి గ్రామంలో పెద ఈశ్వరరావును సోమవారం పరామర్శించారు. ఇటీవల ఈశ్వరరావు సతీమణి గుండెపోటుతో మరణించారు. అడ్డేపల్లి నూకునాయుడు, మామిడి చంటి, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు తదితరులు ఈశ్వరరావును పరామర్శించారు.

నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి

కోటవురట్ల: వరినారు మడుల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ భవానీ సూచించారు. యండపల్లి, జల్లూరు గ్రామాల్లో పర్యటించి నారుమడులను పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలు వివరించారు. నారుమడుల్లో వర్షపునీరు నిలిచిపోవడం వల్ల తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల నారుమడుల్లో నిలిచిపోయిన నీటిని బయటకు తొలగించాలని సూచించారు. 5 సెంట్ల పరిధిలోని నారుమడిలో 2 కిలోల యూరియా, ఒక కిలో పొటాష్ వేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాయ తెగులు ఆశించే అవకాశం ఉందని, ఎక్కడైనా కనిపిస్తే లీటరు నీటిలో 2 మి.లీ హెక్సాకొనజోల్ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హరిపురం బిసిటీ కో ఆర్డినేటర్ డాక్టరు శైలజ, ఏడీఏ ఉమాప్రసాద్, మండల వ్యవసాయాధికారిణి సరోజిని, ఆర్.ఎస్.కె సిబ్బంది త్రినాథ్, మధు, రైతులు పాల్గొన్నారు.

నారు మళ్లలో తెగుళ్ల నివారణకు సూచనలు

ఎస్.రాయవరం : అధిక వర్షాలకు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తల బృందం పలు సూచనలు ఇచ్చారు. సర్వసిద్ధి , సైతారుపేట, పేటసూదిపురం తదితర గ్రామాల్లో పరిశోధన శాస్త్రవేత్తల బృందం పర్యటించారు. అధిక వర్షాలకు నారుమడుల్లో చేరిన నీటిని తీసివేసి, ఆ తరువాత మ్యురేట్ ఆఫ్ పొటాష్ కేజి 5 సెంట్లు నారుమడులకు వేసుకోవాలన్నారు. మ్యాన్కో జబ్ మూడు గ్రాములు లీటర్ నీటిని కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. దమ్ము చేపట్టి ఎకరానికి ఎరువులు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 150 కేజీలు, యూరియా 30 కేజీలు, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో తప్పని సరిగా వేసుకోవాలన్నారు. చల్లని వాతావరణానికి ఆకుమడులకు పొడ తెగులు వచ్చే అవకాశం ఉందని, మడులు చుట్టూ ఉన్న గట్లపై ఉన్న కలుపుని తొలగించి హెక్సాకోనజోల్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి వరినారుకి పిచికారి చేసుకోవాలన్నారు. ఎద పెట్టిన వరి నారు పొలంలో కలుపు నివారణకు 15 నుంచి 20 రోజుల తరువాత బిస్స్ ఫైరీ బ్యాక్ సోడియం మందును తగిన మోతాదులో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె సౌజన్య, వ్యవసాయ విస్తరణాధికారి దినకర్, అనిల్, ఉప్పరాపల్లి సర్పంచ్ శానాపతి శ్రీరాములు పాల్గొన్నారు.



యండపల్లిలో రైతులకు సూచనలిస్తున్న సైంటిస్టులు



సర్వసిద్ధిలో వ్యవసాయశాస్త్ర వేత్తల బృందం

పెద్దవీధిలో డ్రైనేజీ సమస్యపై వినతి

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లులో పెద్దవీధిలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న మురుగునీటి కాలువ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రావును కోరారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, జనసేన నాయకుడు వెలగా సుధాకర్, ఎంపీటీసీ తోట సత్తిబాబు తదితరులు గ్రామంలో పర్యటించిన ప్రత్యేకాధికారిని కలిశారు. ఈ వీధిలో సిమెంట్ రోడ్డుపై వర్షపునీరు, ఇళ్లల్లో వాడుకనీరు నిలిచిపోతోందన్నారు. బయటకు పోయే మార్గాలు లేవన్నారు. వర్షాకాలం వస్తే ఈ వీధిలో ఉన్న సిమెంట్‌రోడ్డు చెరువులా తయారవుతోందన్నారు. దాదాపు ఐదేళ్ల నుంచి ఈ సమస్య ఉందని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని నీరు బయటకు పోయే మార్గం ఏర్పాటు చేయాలని కోరారు.



ప్రత్యేకాధికారికి సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

తైక్వాండో పోటీల్లో పతకాల పంట

యలమంచిలి రూరల్ : యలమంచిలి క్రీడాకారులు ఈ నెల 21న గాజువాక నడుపూరు ఉక్కు కళామందిరంలో జరిగిన 43 వ జూనియర్ సీనియర్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. సత్య స్పోర్ట్స్ అకాడమీకి చెందిన 10 మంది పోటీల్లో పాల్గొనగా 8 మంది బంగారు పతకాలు సాధించారని శిక్షకుడు నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు.

ప్రయోగాత్మక బోధనతో ఫలితాలు

యలమంచిలి రూరల్ : కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం ప్రారంభించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధనా అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు.

తుపాను బాధితులకు సాయం



గోడ కూలిన బాధితురాలు సత్యవతికి సాయం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు నష్టపోయిన బాధితులకు అధికారులు సోమవారం సాయం అందజేశారు. గణపర్తికి చెందిన బూసి చిన తల్లికి చెందిన వంటగది పైకప్పు కూలిపోయింది. దీంతో మండల ప్రత్యేకాధికారి మంజులావాణి సోమవారం పది కిలోల రేషన్ బియ్యం అందజేశారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి దుర్గ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంపోలులో నివాసం ఉంటున్న నరవ సత్యవతి ఇంటి గోడ కూలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి తహసీల్దార్ పాపారావు ఆదేశాల మేరకు సర్పంచ్ గనిరెడ్డి సూరప్పారావు,ఉపసర్పంచ్ ఉల్లింగల సత్తిబాబు,మాజీ ఎంపీటీసీ ఉల్లింగల గోవింద చేతుల మీదుగా 15 కిలోల బియ్యం అందజేశారు.